గుంతలు ఫుల్.. మరమ్మతులు నిల్


బుట్టాయగూడెం మండలం మర్లగూడెం అటవీప్రాంతంలో గుంతలతో ఉన్న రహదారి


గుంతల రహదారిపై ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్న వాహనదారులు

- అడుగడుగునా గుంతలతో రహదారి అధ్వానం
- చుక్కలు చూపిస్తున్న బుట్టాయగూడెం -జంగారెడ్డిగూడెం రోడ్డు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఛిద్రమైన రోడ్డుపై ప్రయాణానికి ప్రజల అవస్థలు

బుట్టాయగూడెం: సంక్రాంతి ముగిసి తొమ్మిది నెలలైంది. శివరాత్రి, ఉగాది, శ్రీరామ నవమి పండుగలు ముగిశాయి. వినాయక చవితి ఈ మధ్యనే ముగిసింది. దసరా పండుగ రానే వస్తుంది. వరుస పండుగలు ఒక దాని వెంట మరొకటి వచ్చిపోతున్నాయి. క్యాలెండర్‌లో తేదీలు మారుతున్నాయి కానీ రోడ్ల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు కానరావడం లేదు. సంక్రాంతి నాటికి అద్దంలా మెరిసేలా రోడ్లను తీర్చి దిద్దుతామని ప్రగల్భాలు పలికిన పాలకులు కాలం గడుస్తున్నా రోడ్ల దుస్థితిపై ఎక్కడా మాట్లాడడం లేదు. ఛిద్రంగా మారిన రోడ్లు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంత ఉండడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తుంటే ఒళ్లు, ఒళ్లు హూనం అవుతున్నాయని ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం ప్రయాణాలకు, సరుకులు, ఆసుపత్రులకు వెళ్లేందుకు ధానమైన రహదారి. నిధులు మంజూరై పనులు చేపట్టినా అవి అసంపూర్తిగానే నిలిచిపోయాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి.

అన్నీ సగం సగం పనులే:
బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రోడ్డు పనులకు మూడు దశలో నిధులు మంజూరైనట్లు అధికారులు తెలపారు. మొదటి దశలో రూ.70 లక్షలతో అక్కడక్కడా తారు రోడ్డు వేసి వదిలేశారు. అయితే రెండు, మూడు దశల్లో రోడ్డు పనులు రూ.4 కోట్ల 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటిలో బుట్టాయగూడెం మండలం సింగన్నపల్లి నుంచి మర్లగూడెం ఎంట్రన్స్ వరకూ ఒకటిన్నర కోటి, అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం రూ.3 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. రోడ్డుపై రెడ్‌మిక్స్ వేసి వదిలేశారు. అసంపూర్తిగా ఉన్న పనులు నెలలు గడుస్తున్నా కనీసం అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతల మయంగా మారాయి. బుట్టాయగూడెం మండలం సింగన్నపల్లి నుంచి జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డు వరకూ అధ్వానంగా ఉన్న రోడ్డుపై ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ, స్కూల్ బస్‌లు, ఆటోల్లో ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకుని రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా
బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వరకూ గతంలో రోడ్డు చాలా అధ్వానంగా ఉండేది. ఆ సమయంలో సుమారు రూ.కోటి వ్యయంతో ఆంజనేయస్వామి ఆలయం నుంచి సింగన్నపల్లి వరకూ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో అక్కడి వరకూ ప్రజలకు రోడ్డు కష్టాలు కొంతమేర తగ్గాయి. రెండో దశలో సింగన్నపల్లి నుంచి జంగారెడ్డిగూడెం బైపాస్ వరకూ ప్రతిపాదనలు పంపినప్పటికీ ఎన్నికల కారణంగా పనులు ముందుకు సాగలేదు.

ప్రజలను నిర్లక్ష్యం చేస్తే ఇంటికి పంపడం ఖాయం



కూటమి పాలకులు సంక్రాంతికి రోడ్లను అద్దంలా మారుస్తామని ప్రగల్భాలు పలికారు. బుట్టాయగూడెం రోడ్డు ఒక్కటే కాదు. ఏలూరు రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. అధ్వానంగా తయారైన రోడ్లపై ప్రజలు అవస్థలు పడుతుంటే పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరం. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఇంటికి పంపించడం ఖాయం.

–ఉద్దండం ఏసుబాబు, న్యాయవాది, జంగారెడ్డిగూడెం

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు


డీఎస్పీ రవిచంద్ర

చింతలపూడి: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత వారం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి, ఏలేశ్వరపురం ఇసుక ర్యాంపుల నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న 21 లారీలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు లారీలకు రూ.50 వేల చొప్పున మైనింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా జరిమానాలు విధించి, 11 లారీలను విడుదల చేసినట్టు తెలిపారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు


రహదారి మరమ్మతులు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బుట్టాయగూడెం: మండలంలోని పందిరిమామిడిగూడెం నుంచి గుబ్బల మంగమ్మగుడికి వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. ఆ ప్రదేశాలను గుబ్బల మంగమ్మ గుడి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. గుడికి వచ్చే వాహనదారులు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రాళ్లతో ఈ గోతులను పూడ్చామని ఆలయ కమిటీ ప్రతినిధులు కోర్సా రాంబాబు, కోర్సా గంగరాజు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్


విద్యార్థిని గుర్రం హనీని అభినందిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ఈ నెల 14న అమలాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 5వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2025 పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన ఏడో తరగతి విద్యార్థిని గుర్రం హనీని పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు సోమవారం అభినందించారు. చింతలపూడిలోని మేరీ ఇమ్మాక్యులేట్ హైస్కూల్‌లో హనీ చదువుతోందని తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌లో అర్జీల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో

జంగారెడ్డిగూడెం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఆర్డీవో ఐ.కిషోర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వితంతు పింఛన్, ఆక్రమణల తొలగింపు, తదితర సమస్యలపై ప్రజలు అర్జీలను అందజేశారు.

శ్రీవారి గోవులకు టీకాలు


గిత్తకు గాలి కుంటు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై గో సంరక్షణ శాలలోని ఆవులకు పశు వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మొత్తం 250 ఆవులు, 54 దూడలకు ఈ టీకాలు వేశారు. అలాగే ద్వారకాతిరుమల గ్రామ పరిధిలో 120 గేదెలకు, 30 ఆవులకు టీకాలు వేసినట్టు మండల పశు వైద్యాధికారి అంగర సురేష్ తెలిపారు.

'నిరుద్యోగి ఆవేదన'ను జయప్రదం చేయండి

చింతలపూడి: రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 17న విజయవాడలో చేపట్టనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం నిరుద్యోగ ఆవేదన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు అమలు చేయాల ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు సాయిల అవినాష్, పిట్టా చందు, తొర్లపాటి అంబేద్కర్, ముళ్లగిరి నాని, జి శాంసన్ పాల్గొన్నారు.

రేపు చలో విజయవాడ

కొయ్యలగూడెం: నిరుద్యోగ యువతకు బాసటగా విజయవాడలో 17వ తేదీ చేపట్టే సదస్సుకు నిరుద్యోగ యువత కలిసి రావాల్సిందిగా సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప ఆంజనేయరాజు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా యువతను మరింత నైరాశ్యంలోకి నెడుతున్నాయన్నారు. విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయ ఆవరణలో నిర్వహిస్తున్న సదస్సుకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నిరుద్యోగ యువతకు దిశా నిర్దేశంతో పాటుగా ప్రభుత్వాలపై పోరుకు సమాయాత్తం చేస్తారని ఆంజనేయరాజు తెలిపారు.

విర్డ్‌లో శస్త్ర చికిత్సలు విజయవంతం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈ నెల 13, 14 తేదీల్లో తుంటి, మోకాలు ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న 14 మంది జాతీయ స్థాయి ప్రముఖ ఫ్యాకల్టీ 14 మంది రోగులకు శస్త్ర చికిత్సలు నిర్వహించగా, 150 మంది వైద్యులు స్క్రీన్ ద్వారా లైవ్‌లో వీక్షించారు. అతి క్లిష్టమైన మోకాలు, తుంటికి సంబంధించిన ఇన్‌ఫెక్టెడ్, రివిజన్ శస్త్ర చికిత్సలను డాక్టర్ కృష్ణ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు మాట్లాడుతూ ఇటువంటి శస్త్ర చికిత్సల ద్వారా వైద్యులు తమ విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. జాతీయ స్థాయి వైద్యులు రాజేష్ మల్హోత్రా, మహేష్ కులకర్ణి, నరేంద్ర రెడ్డి, రాజ్ కుమార్ నటేశన్, సాయి లక్ష్మణ్ అన్నే, అనిల్ ఉమ్మేన్, బిపిన్ తెరువుల్, సమీర్ అలీ పర్వత, చంద్ర శేఖర్, సునీల్ అప్సింగి, సుమన్ పెండ్యాల, వినయ్ కిషోర్, ఆదిత్య కృష్ణ, రాంప్రసాద్ కంచెర్ల, రాజేష్ కుమార్ రెడ్డి, భూషణ్ శర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి


మాజీ హోంమంత్రి వనితకు పూల బొకేను అందిస్తున్న జ్యోతి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మాజీ హోం మంత్రి తానేటి వనితకు కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసం వద్ద పార్టీ మండల నాయకులతో మర్యాదపూర్వకంగా కలసిన ఆయన ముందుగా వనితకు శాలువా కప్పి, పూల బొకేను అందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వనిత సూచించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, రాష్ట్ర మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శి షేక్ మస్తాన్ బాషా, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ స్మారక ఘాట్‌ను సందర్శించిన నేతలు


ఇడుపుల పాయలో మహానేత వైఎస్సార్ స్మారక ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ఇడుపులపాయలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్మారక ఘాట్‌ని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కుక్కల ధర్మరాజు, నాయకులు పిట్టా సురేష్, వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలం వెల్లటూరి సర్పంచ్ కె.హుస్సేన్ సాబ్, వైఎస్సార్ కడప జిల్లా వీరపునాయినిపల్లి మండలం గంగిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ బైరెడ్డి కిషోర్, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు చిత్తపూరి శేఖర్, మహమ్మద్ ఉమర్ షరీఫ్, గుబ్బల వెంకటేశ్వరరావు, వీరవల్లి సోమేశ్వరరావు, యాక్టర్ భాషా, కోరుమిల్లి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు బాలరాజు పరామర్శ


జంగా ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలరాజు

టి.నరసాపురం: బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అన్ని వేళలా అందుబాటులో ఉంటుందని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండంలోని మల్లుకుంటలో పలు కుటుంబాలను పరామర్శించారు. దీనిలో భాగంగా గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న గాది కృష్ణారెడ్డిని పరామర్శించారు. అలాగే గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జంగా ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనురాజు, తమ్మారి శ్రీనివాసరెడ్డి, పులగం వసంత రెడ్డి, దోరేపల్లి నరసింహారావు, సింగంశెట్టి రాంబాబు, ఉమ్మడి తేజ, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక సమస్యల సాధనకు నిర్వహిస్తున్న దశలవారీ ఆందోళన కార్యక్రమాలు జయప్రదం చేయాలని జంగారెడ్డిగూడెం విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపునిచ్చింది. సోమవారం జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గతంలో అంగీకరించిన అమలు పరచని ముఖ్య సమస్యలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ జంగారెడ్డిగూడెం డివిజన్ చైర్మన్ సీహెచ్ రాజు, కన్వీనర్ టి.మురళీమోహన్‌రావు, ఇంజనీర్స్ విభాగం కో-కన్వీనర్ యు.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తమ్మిలేరుకు కొనసాగుతున్న వరద

చింతలపూడి: ఏలూరు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. సోమవారం కూడా అధికారులు 1,962 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత నెల రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో ఎగువ ఖమ్మం జిల్లా నుంచి తమ్మిలేరుకు వరద నీరు వచ్చి చేరుతోంది. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 347.75 అడుగులకు, గోనెల వాగు బేసిన్ 347.49 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ లాజరుబాబు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 0.663 టీఎంసీలకు, గోనెల వాగు బేసిన్ 1.110 అడుగులకు చేరుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 1,511 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాలువ ద్వారా ప్రాజెక్టులోకి వస్తుందన్నారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చనని అధికారులు చెప్పారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు డీఈ తెలిపారు.

జోరు వానలో భక్తుల పరుగులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో సోమవారం జోరు వానలో భక్తులు పరుగులు తీశారు. తెల్లవారుజామున పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం భారీగా కురిసింది. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల పార్కింగ్ ప్రదేశం నుంచి పరుగులు తీస్తూ ఆలయానికి చేరుకున్నారు. వర్షం తగ్గిన తరువాత దేవస్థానం కార్మికులు ఆలయ పరిసరాల్లో నిలిచిన నీటిని బయటకు మళ్లించారు.

వైఎస్సార్ సీపీ పోరాటంతో కూటమి వెనుకడుగు


వైఎస్సార్ సీపీ కార్యకర్త సత్యనారాయణకు ఆర్థిక సహాయం చేస్తున్న నేతలు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ శ్రేణులు కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న పోరాటంతో సత్ఫలితాలు వస్తున్నాయనీ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం పేర్కొన్నారు. కన్నాపురంలో అనారోగ్యానికి గురైన పార్టీ సీనియర్ కార్యకర్త ఎండావు సత్యనారాయణను ఆయన నివాసంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రెడ్ బుక్ రాజ్యాంగం అమలైందని అయితే ప్రజల మద్దతుతో మనం వాటిని తిప్పికొట్టి అసలు యదార్థాలు బయటపెట్టగలిగామన్నారు. దీంతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతతో దాడులను కొంత వరకు అరికట్టగలిగామని ఇదే పంథా కొనసాగించి వారి ఆగడాలు అకృత్యాలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా కన్వీనర్ సొంగా రాకేష్ ఆధ్వర్యంలో సేకరించిన రూ. 20 వేలు నగదును పార్టీ శ్రేణులతో కలిసి సత్యనారాయణకు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు మంతెన సోమరాజు, మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ నాయకులు గంటా శ్రీను, కాటుబోయిన సురేష్, ఉందుర్తి శ్రీను, యడ్లపల్లి సురేష్, మండా ప్రసాద్, ఎండి షాబాజ్, ఊసల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం నేటి ఇంజనీర్లకు ఆదర్శం


ఇంజనీర్లను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ద్వారకాతిరుమల: మోక్షగుండం విశ్వేశ్వరయ్య నేటి ఇంజనీర్లకు ఆదర్శనీయుడని పలువురు వక్తలు అన్నారు. ద్వారకాతిరుమల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ద్వారకా రెసిడెన్సీలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా మైనింగ్ ఇంజనీర్ నార్ల కాశీనాథం, విద్యుత్ శాఖ ఏఈఈ జి.సోమేశ్వరరావు, రూరల్ వాటర్ సప్‌లై ఏఈ ఎస్.రాజేంద్ర ప్రసాద్, హౌసింగ్ ఏఈ కె.వెంకటేశ్వరరావు, ఏఈలు ఎ.ప్రవీణ్ కుమార్, జి.శిరీష, ఇరిగేషన్ ఏఈఈ పామర్తి వెంకట సతీష్‌లను క్లబ్ సీనియర్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి
చింతలపూడి: భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చింతలపూడిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ట్రాన్స్‌కో ఏఈ వెంకయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, సెక్రటరీ రామకృష్ణ, చిల్లపల్లి రామ్మోహన్‌రావు, డీసీలు గోలి చంద్రశేఖర్‌రెడ్డి, చుండూరు అబ్బయ్య, సభ్యులు గోలి నాగిరెడ్డి, కొత్తపూడి శేషగిరిరావు, కొనకళ్ల వెంకట కేశవరావు, చిక్కాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం
టి.నరసాపురం: సెప్టెంబర్ 15న ఇంజనీర్ల దినోత్సవం సామాజిక సేవా కార్యకర్తల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ డి.సంపత్ కుమారి, గృహ నిర్మాణ సంస్థ వర్క్ ఇన్‌స్పెక్టర్ సొంగా రాజుని ఘనంగా సత్కరించారు. టి.నరసాపురం ఎంపీడీవో నగ రాజకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు. సామాజిక కార్యకర్తలు ఎస్‌డీ నాసర్ పాషా, జమీల బేగం, కొరివి వెంకటేశ్వరరావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, బొడ్డపాటి రమేష్, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు జి.మణికుమారి, ఏపీవోలు బి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సీఓ కట్టప్ప పాల్గొన్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్తలు

టి.నరసాపురం: అధ్వానంగా మారిన టి.నరసాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు రోడ్డు అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఎంపీడీవో నగరాజకుమారి, తహసీల్దార్ తోట సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా మాట్లాడుతూ మండల కేంద్రమైన టి.నరసాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు రోడ్డు గుంతలతో ఛిద్రంగా మారిందన్నారు. డ్రెయిన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిస్తే ప్రధాన రోడ్డు పంట కాలువలా మారుతుందన్నారు. రోడ్డును వెంటనే నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జమీల బేగం, సామాజిక కార్యకర్తలు కొరివి వెంకటేశ్వరరావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, రెడ్డి శ్రీనివాస్, బొడ్డపాటి రమేష్, నార్లపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూసేకరణ చేయాలి

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం సేకరిస్తున్న భూములకు సంబంధించి టైటిల్ వెరిఫికేషన్ లింక్ డాక్యుమెంట్ల ఆధారంగా పారదర్శకంగా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో ఆదివాసీ విజ్ఞాన కేంద్రం భవనం వద్ద ఉడతా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సెక్రటరీ సభ్యురాలు మొడియం నాగమణి, నాయకులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, పూనెం శేఖర్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం

బుట్టాయగూడెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన ఒక యువకుడికి కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.5 వేల నగదుతో పాటు మరో రూ.5 వేల విలువ చేసే నిత్యావసర సరుకులను సోమవారం ఆ సంఘ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ కార్యదర్శి శీలం కృష్ణంరాజు, ట్రెజరర్ పి.మోహన్, సహాయ కార్యదర్శి మణికె సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు ఉద్దండం ఏసుబాబు, కేఎస్ శంకరరావు, ఆకుల ఏసుబాబు, స్థానిక కాపు ప్రతినిధులు సురేష్, రవీంద్ర పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

జంగారెడ్డిగూడెం: సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నిరసన వారంలో భాగంగా సోమవారం జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొయ్యలగూడెం మండల ప్రధాన కార్యదర్శి వై.వీరభద్రయ్య, ఏపీటీఎఫ్ నాయకులు ఏ.దయరాజు, ఎస్.గోపిశ్రీనివాస్, జగదీష్, కె.సుబ్బారావు, ఏ.శ్రీరాములు, రామిరెడ్డి, హరినాగ్, విలియమ్స్, రామకృష్ణ, ధర్మరాజు, లలితా దేవి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.